# దొంగలు

ఎమ్. రామకోటి

బ్యాంకులో చెక్కు మార్చుకొని బయటి కొస్తున్నాను.

"జేబులు సరిగ్గా సూస్కోండి, బాబూ!"

గతుక్కుపడి చూసేను.

"దొంగనాకొడుకులు . . . కంట్లో కనుమాయం సేస్తగలు... ఒర్సి యేలెత్తి సూపించలేం!"

గడుసుగా అందరి కళ్ళలోకీ నిలదీసి చూస్తున్నాడు బస్సు కుర్రాడు. కళ్ళతోనే పాసెంజర్లని లెక్కబెట్టుకుంటూ రోడ్డుమీద పచార్లు చేస్తున్నాడు.

సీతమ్మధార సిటీ బస్సు విక్టోరియా బొమ్మ దగ్గర వగుర్చుకుంటూంది.

డ్రైవరూ, కండక్టరూ ఎదురుగా ఉన్న కిళ్ళీ బడ్డీ ముందు నిలబడి చిల్లర లెక్కబెట్టుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

జేబు బరువుగా ఉంది. గుండె దిబుకుదిబుకుమంటూంది. అనుకోకుండా చెయ్యి పాంటు జేబులోకి వెళ్ళిపోయింది.

సరుకుతో సీతమ్మధార కొస్తున్నారు అనపర్తివాళ్ళు. వేళ దాటిపోతే జారుకుంటారు. రిక్షామీద వెళితే రూపాయలూ, గంటలూ హారతి కర్పూరంలా హరించుకుపోతాయి. ఆటోలు జగదాంబ దగ్గరకాని దొరకవు. ఏం దారి?

బస్సు సిద్ధంగా ఉంది. జనం నిండిపోతున్నారు. ఈ రద్దీలో ఎక్కడమా, మానడమా?

తటపటాయిస్తున్నాను.

"ఒరోరె, సెవులూ, బెలువూ ఓపాలే పారొస్తున్నాయి. యీయాటి కేటొచ్చిందో యియ్యాల! ఓయిడయివోరూ,కండ్రటూ ఏటోయ్ మీ అన్యా? రండ్రండోయ్. ఏటే సూస్కోరూ?" కసురుకుంటూ కిళ్ళీబడ్డీ వేపు చూసేడు కుర్రాడు.

బొళ్ళుమని చిల్లర బిళ్ళలు తోలుసంచీలోకి జాడించి తోసి మెడకి తగిలించుకొని ఒక్క ఊపులో బస్సులోకి దూకి టిక్కెట్లు చింపుతున్నాడు కండక్టరు. సగం సగం కాలుస్తున్న బీడీ ఆఖరి దమ్ము లాగి పారేసి ఛంగున చక్రంమీద ఎగిరి పడ్డాడు డ్రైవరు.

గేరు మారి బుర్రుబుర్రుమంది బస్సు.

"రైట్, రైట్!" బస్సు మీద బాజా వాయిస్తున్నాడు కుర్రాడు.

బస్సు కదిలిపోతూంది.

పాంటు జేబులో కుడి చెయ్యి కాపలా పెట్టి పరుగెత్తి ఎడంచేత్తో బస్సు ఊచ అందుకుని మెట్టు మీదికి ఎగిరి ఎక్కేను. ఆ ఊపులో ఆనరా లేక తూలి పడిపోబోయేను.

"అమ్మమ్మ ... ఎంత ప్రమాదం ... ఇంకా నయం" అంటూ ముందుసీట్లో కూర్చున్నతను చెయ్యాదుకున్నాడు.

"థాంక్సండీ." తలెత్తి చూసేను.

బట్టతల, బొద్దింక మీసం. కుంకుడు పిక్కల్లా ఉన్నాయి కళ్ళు. ఎలక కలుగులాంటి నోరు. నల్లగా నిగనిగలాడుతూ బూరి బుగ్గలు నొక్కేస్తున్నాయి. నుదుటిమీద చుట్ట మచ్చ. కాలిపోయిన కొబ్బరి చిప్పలా ఉంది మొహం.

ఏమనాలో తెలియక నవ్వుతూ కొంచెం జరిగి కూర్చోవడానికి చోటు చేసేడు. మెట్లదగ్గర అడ్డు సీట్లో బస్సు కుర్రాడి పక్కనే కూర్చున్నాను.

వాడెక్కడా కిందా మీదా నిలబడ్డం లేదు. ఊచలు పట్టుకుని వేలాడుతూ, పరుగెత్తుతున్న బస్సు మీద పాకుతూ డ్రైవరు సీటుదాకా వెళుతూ వస్తూ, కోతిపిల్లలా మొగ్గలేస్తున్నాడు. వేళ్ళు మడిచి నాలిక మడతబెట్టి, చిలకపిట్టలా ఊళలేస్తూ చెవులు గింగిర్లెత్తించేస్తున్నాడు.

లక్ష్మీటాకీసూ, కొత్త రోడ్డూ, పాత బస్సుస్టాండూ దాటిపోయి పూర్ణా జంక్షను చేరుతూంది బస్సు.

"తప్పుకో, తప్పుకోరా, గుంట నాయాల." దార్లో వచ్చే పోయేవాళ్ళ నెత్తిమీద చెయ్యేసి తోసి పారేస్తున్నాడు కుర్రాడు.

అడ్డుగా బండీ ఆపి రిక్షా వాడు సవాలుచేస్తూ నిలుచున్నాడు. కీచుకీచుమని గగ్గోలు పెట్టి ఒక్క కుదుపుతో ఆగింది బస్సు.

తూలిపోయి మీద పడి నా తొడ మీద మోచేయి ఆనుకొని ఆనుకున్నాడు నా పక్కనున్న బట్టతలతను. జేబులో చెయ్యి పెట్టుకుని చిరాగ్గా చూసేను. తప్పు చేసిన వాడిలా వెర్రి నవ్వు నవ్వేడు. ముందు రెండు పళ్ళూ పారల్లా బయట పడ్డాయి. చెవులు రిక్కించి నోరు తెరిచిన చెవుల పిల్లిలా ఉన్నాడు. నవ్వొచ్చింది.

జాలిగా నవ్వుతూ చూసి మోచెయ్యి తుడుచుకుంటూ లేచి బట్టలు దులుపుకుంటున్నాడు. అరచేతుల తెల్లచొక్కా, కాకీ నిక్కరూ ఇస్త్రీ మడతలేనా నలగకుండా నీటుగా ఉన్నాయి.

నవ్వు చూస్తే అమాయకంగా ఉంది. పాంటు జేబుమీద మోచేత్తో ఆని పసికట్టినట్టున్నాడు. చెయ్యి చురుక్కైంది కాదు కదా? ఎందుకేనా మంచిది ఓ కన్నేసుంచాలి. ఓరగా చూసేను. మొహమంతా కళ్ళు చేసుకుని ఆప్యాయంగా రోడ్డు మీదికి చూస్తున్నాడు.

"ఏట్రోవ్,ఏడుకొండలూ! ఇయ్యాల చిటే పట్టినావేటి? ఏటి సంగతి?" నవ్వుతూ పలకరించి స్టీలు కారియర్ల గంప సీటు కిందికి తోసి తలమీద చుట్టు గుడ్డ తీసి గంపలో పెట్టి బస్సెక్కింది పిల్ల.

చింపిరి జుత్తు చెలరేగుతూంది. చిలిపి కళ్ళు అల్లరి పెడుతున్నాయి. గుండెల దాకా దిగిపోయిన రవికె మెడంచు ఉబికే వయసు బిగువును అదిమిపట్టలేక నానా అవస్థ పడుతూంది. మెడలో చవకబారు తెల్లపూసలు చిక్కులుపడి మెలతబడుతున్నాయి.

"బస్సెటి రైలేటి ... మన కేడ్రైతే నేటి... పన్నరిగి పోవా లంతే ..." కళ్ళతోనే మింగేస్తున్నాడు ఏడుకొండలు.

బట్టతల తడుముకుంటూ బొద్దింక మీసం కిందికి దువ్వుకుంటూ గుచ్చి గుచ్చి పాలిపోయిన నల్ల రవికలోకి చూస్తున్నాడు.

"సీ ... పోకిరి నచ్చినోడా!" అన్నట్టు చురచుర చూసి పైటచెంగు మెడమీంచి తీసి చుట్టబెట్టుకుని కూర్చుంది.

"ఇదిగో ... నిన్నే ..." పలకరించేడు ఏడుకొండలు.

"ఏట్రా?" అన్నట్టు మొహం తిప్పి చూసింది.

"నీ కీ గంపల మోతేటే, అప్పలకొండా... ఎన్ని సుట్లు సెప్పినాయినవు గందా?" బాధపడిపోతూ చూసేడు.

"ఏ గంపలూ మొయ్యకుండా నా కెలా గడుస్తుద్దిరా ... నీ కేటి మారాజువి. సెవటూడ్సకండా జరిగిపోద్ది నీకు. నీ కబుర్లు కేటిలే!" మూతి తిప్పుకుని మొహం తిప్పేసుకుంది అప్పలకొండ.

"అదిగో ... ఆ మాటే అనొద్దన్నను ... నా నుండగా నీ కేటే ..."

"సీత్తేరీ ... నానూ ఆ మాటే ఎత్తొద్దంటున్నను." కొరడాలా ఝళ్ళుమంది.

అందరూ వాళ్ళవేపే చూస్తున్నారు.

సిగ్గుపడి మొహం చాటుచేసుకుంది అప్పలకొండ.

"అల్లతో మనకేటే ... ఇదిగో ... ఇటు సూడే" అని అందరివేపూ కోపంగా చూసి బతిమాలుతున్నాడు.

"ఏట్రా నీ గోలా ... సిగ్గూయెగ్గూ లేదంట్రా ...సీ!" నవ్వుకుని మొహం దించేసుకుని ఓరచూపులు చూసింది.

బుగ్గలు సుడిగుండాలు తిరుగుతున్నాయి. నా గుండె లొత్తులు పడుతూంది. ఉండబట్టలేకపోయేను. నవ్వుతూ చూసేను. చూడకుండా ఉండలేక అప్పలకొండ మొహంలోకి చూసేను.

"సి ... సిన్నా పెద్దా ఒకే టేసూపూ ఒకేటే బుద్ధీ ..." అన్నట్టు చూసింది.

ఆ చూపు చురుక్కుమంది. తల కొట్టేసినట్టయింది. ఎవరేనా చూసేరేమోనని దొంగచూపులు చూసేను.

"రైట్, రైట్!" అంటూ సందీ కుదిపి గలగల లాడిస్తున్నాడు కండక్టరు.

"సూస్కోండి బాబూ. జేబుకొటుగాల్లుంటరు ..." గాలికి చెబుతున్నాడు బస్సు కుర్రాడు.

నా గుండె గుభేల్మంది. ఎక్కేజనం, దిగేజనం. తొడతొక్కిడిగా ఉంది బస్సు. పాంటు జేబులోకి చెయ్యి దూర్చి పట్టి చూసుకున్నాను. నా మోచేయి తగిలి దిగువ చూపులు చూసి జరిగేడు ఏడుకొండలు.

డ్రైవరు చక్రం తిప్పి క్లచ్ వదిలేడు. గేరులో ఉండిపోయిందిలా ఉంది బెదురు గొడ్డులా ముందుకి దూకింది బస్సు.

మళ్ళీ మీద పడ్డాడు ఏడుకొండలు. వినుక్కుని కోరగా చూసేను. నేనేం చేస్తా నన్నట్టు ఓరగా చూసేడు. కదా ల్మనే కత్తుల్లా కలుసుకున్నాయి చూపులు. నా మొహం చూసి దూరంగా జరిగి కూర్చున్నాడు ఏడుకొండలు.

పగలబడి నవ్వింది అప్పలకొండ.

"సాల్లేయె ... నీ యిరగబాటూ ..." ఉడుకుబోతుగా చూసేడు ఏడుకొండలు.

తుళ్ళిపడే ఏరులా నవ్వుతూంది అప్పలకొండ. తుప్పున ఎగిరిపడే గిడసలా సీటుమీద తూగిపోతూంది. పైట చెంగు పట్టుజారి దిగిపోతూంది.



పైపైకి...                                    ఫొటో—ఆర్. ఉదయభాస్కర్ (తిరుచిరాపల్లి)

"అబ్బ! ఏటి ఆ నవ్వు ..." కొండెక్కిపోతున్నాడు ఏడుకొండలు.

మరోమారు కీచుమని బెక్కుబెక్కుమంది బస్సు.

తూలిపోయి అప్పలకొండ మీద పడిపోయేడు ఏడుకొండలు.

"ప్సీ ..." అని పకాల్మని నవ్వి, "నాకాడేటున్నాయిరా ... సందు దొరికితే కాన ... సావాటు సచ్చినోడు" అని ఈసడించుకుని దూరంగా జరిగిపోయింది అప్పలకొండ.

తల నెరిసినా, పళ్ళూడినా చూపులకి మాత్రం చురుకుదనం తగ్గదులా ఉంది. అందరూ పాలిపోతున్న నల్ల జాకెట్టులోకే చూస్తున్నారు.

నవ్వాపుకోలేక గుండె లదుముకుంటూంది అప్పలకొండ.

పిల్లల బుగ్గలు కవ్విస్తున్నాయి. నవ్వులు మనసుని రెచ్చగొడుతున్నాయి. జేబులో డబ్బు నా చూపులకి పగ్గా లేస్తూంది.

ఏడుకొండలు వేపు చూసి పాంటు జేబు తడుముకున్నాను.

సందు తిరిగినప్పుడూ, దారి మళ్ళినప్పుడూ అటో ఇటో ఏడుకొండలు మీద పడుతూనే ఉన్నాడు.

'పిడివ్రధా మధ్యని ... పానకంలో పుడకలా' అనుకుని అప్పలకొండవేపు దొంగచూపులు చూస్తూ, ఏడుకొండల మోచేతి పొడుపులూ ఓరచూపులూ కాసుకుంటూ వినుగ్గా జేబు తడుముకుని చూసుకుంటున్నాను. ఏడుకొండల్ని నానా తిట్లూ తిట్టుకుంటున్నాను.

బారక్సు దగ్గర బేరం చూసుకుని జంయి జంయిమని సూర్యాబాగ్ మలుపు తిరిగి హాచ్ హాచ్‌మని తుమ్ముకుంటూ జగదాంబ జంక్షన్‌లో ఆగింది బస్సు.

మందలా మీద పడిపోతున్నారు మనుష్యులు. ఆడా మగా బస్సుమీద కెగబాకుతున్నారు.

"దిగనీండ్రో, బాబూ...ఏటా తొందర?" అంటూ ఆ గుంపుకి అడ్డంగా నిలబడి అదలాయిస్తూ దిగేవాళ్ళకి దారి చేస్తున్నాడు కుర్రాడు.

బట్టతల మీద రాసుకుంటూ సీటు కిందికి వంగి తడుముకుంటున్నాడు ఏడు కొండలు. ఏమిటా అని చూసేను.

చేతి కర్రలు లాగి పైకెత్తేడు. పలక మీద గుడ్డమెత్తలు చంకకింద పెట్టుకుని లేచి నిలబడి ఒంటికాలు ఈడ్చుకుంటూ మెట్లమీద కర్రలు ఆన్చి టక్కుటక్కుమని కిందికి దిగిపోతున్నాడు. అందరూ తప్పుకుని దారి ఇస్తున్నారు.

నా మనస్సు కలుక్కుమంది.

జేబుకాటుకోసం మీద పడుతున్నా డనుకున్నాను.

కుంటివాడు, పాపం! ఎన్ని అనుమానాలు పడ్డానూ! కామెర్ల కళ్ళకి లోకమంతా పచ్చగానే కనబడుతుందంటారు అందుకే. స్మగుల్డు గూడ్సు కోసమే గదా నా ఈ పరుగూ? క్రేప్ పాంటు గుడ్డలకోసం, టేపురికార్డర్ల కాసెట్ల కోసం, వాటిమీద దొంగ లాభం కోసం— అంతేగా?

వెళుతూ వెళుతూ అప్పలకొండ మొహంలోకి దీనంగా చూసేడు ఏడు కొండలు.

నా గుండె కరాల్మంది.

"ఓ రెల్లా, కుంటి సచ్చినోడా ... నీకూ నాకూ పోత్తేటి" అన్నట్టు తల విరుసుకుంది అప్పలకొండ.

అసహ్యం వేసింది అప్పలకొండ చూపు చూస్తే.

నా మనస్సులో నేరం కెలుకుతూంది. కుమ్మరిపురుగులా నా తొందరపాటు దొలుస్తూంది.

ఏం చెయ్యలేక నొచ్చుకుంటున్నాను.

ఏద్వాన్సు బుకింగు అయిపోయిందిలా ఉంది పశువుల మందలా చిత్రాలయ గేట్లోంచి జనం వీధిని పడ్డారు.

అందులో మునిగిపోయేడు ఏడు కొండలు.

ఆత్రతగా చూసేను ఆ గుంపులోకి. పట్టిపట్టి చూస్తూంది అప్పలకొండ.

గుంపు పలచబడింది. ఎవరిదో పర్సు గాలిపడగలా మీది కెగిరింది. రెప్పపాటులో నోట్లు ఏడుకొండలు చేతిలో రెపరెపలాడేయి. నిక్కరుజేబులో కూరుకుపోయి దాక్కుంటున్నాయి. కళ్ళు జిగేల్మన్నాయి.

"ఆఁ ఆఁ ... దొ ... దొ ..." అరవబోయేను.

బస్సు కదిలిపోయి పరుగు లంకించుకుంది.

తెల్లబోయి చూసేను.

విరగబడి నవ్వుతూంది అప్పల కొండ.

★